భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చిలో.. పాస్టర్ రెవరెండ్ సాల్మన్ బోద, శాంత్‌కుమార్



కేటీనగర్ బేతనియ చర్చిలో.. పాస్టర్ రెవరెండ్ సామ్యేల్ బాబు బైరపోగు

మలక్‌పేట, ఎల్‌బీనగర్ నియోజకవర్గాల పరిధిలోని గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిలలో క్రైస్తవులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేటీనగర్‌లోని బేతనియ బాప్టిస్టు చర్చిలో పాస్టర్ రెవరెండ్ సామ్యేల్ బాబు బైరపోగు, దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చిలో సీనియర్ పాస్టర్ సాల్మన్ బోద, జూనియర్ పాస్టర్ శాంత్‌కుమార్, మూసారంబాగ్ క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చిలో సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ప్రభుచరణ్, వన్య ఇమ్మాన్యుయేల్ ఏసు సిలువలో పలికిన ఏడు మాటలు ధ్యానించారు. క్వాయర్ టీమ్ వారు స్తుతిగీతాలతో ఏసుక్రీస్తును ఆరాధించారు. మానవుల అతిక్రమ క్రియలను బట్టి ఏసుక్రీస్తు సిలువలో గాయపరచబడ్డారని పేర్కొన్నారు. ఏసుక్రీస్తు కనబరిచిన ప్రేమ, క్షమాగుణం అందరూ అలవర్చుకోవాలని వారు కోరారు. ప్రజలందరి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

– మలక్‌పేట


మూసారంబాగ్‌లో.. పాస్టర్ రెవరెండ్ ప్రభుచరణ, వన్య ఇమ్మాన్యుయేల్


సింగరేణికాలనీ ఫెయిత్ బాప్టిస్ట్ చర్చిలో మాట్లాడుతున్న పాస్టర్ భీముడు నాయక్


క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

డ్రైనేజీ సమస్యలు పరిష్కరిస్తాం



వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని శక్తినగర్‌కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఓంకార్‌నగర్‌లో ఆర్చి ప్రారంభోత్సవానికి హాజరైన కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డిని శక్తినగర్‌కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కలసి డ్రైనేజీ సమస్యలపై ఆయనకు వినతి పత్రం ఇచ్చారు. ఓంకార్‌నగర్ కాలనీ ఫేజ్–2, డ్రైనేజీ శక్తినగర్ కాలనీలో రోడ్ నం.10లో కలుస్తోందని ఆగస్త్య ఆసుపత్రి డ్రైనేజీని కూడా దీనిలో కలుపుతున్నారని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. పాత పైప్‌లైన్‌ల స్థానంలో కొత్తగా పెద్ద పైప్‌లైన్‌లు వేసి సమస్యను పరిష్కరించాలని వారు కార్పొరేటర్‌ను కోరారు.

అలరించిన ప్రార్థన గీతాలు

వనస్థలిపురం: వనస్థలిపురంలోని లిటిల్ ల్యాంబ్ చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బిషప్ రెవరెండ్ డా. కె.సుదర్శన్‌రావు, అసోసియేట్ పాస్టర్ రెవ. ప్రమోద్ క్రీస్తు సందేశాన్ని సిలువపై ఏసు క్రీస్తు పలికిన ఏడు మాటలను సభ్యులకు వినిపించారు. అనంతరం పలువురు ఆలపించిన ప్రార్థన గీతాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో చర్చి అధ్యక్షుడు టీ.ఎస్.బాబూరావు, ఉపాధ్యక్షుడు జార్జి ముల్లర్, కార్యదర్శి ఎం.భాను కిరణ్, సంయుక్త కార్యదర్శి ఎన్.జాన్ జయదాస్, రఘురాం, జాకబ్ ప్రసాద్, కాంతా రమేష్, విజయలక్ష్మి లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

మన్సూరాబాద్: తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు సామిడి శేఖర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ కార్యదర్శి రమావత్ సక్రునాయక్ హాజరై శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా 10కోట్ల కార్మికుల సమస్యలు పరిష్కారం లేక అవస్థలు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వాలు మారిన శ్రమ జీవుల ప్రమాణాలు మారడం లేదని విమర్శించారు. నిర్మాణ రంగంలో వసూల్ చేస్తున్న సెస్‌లో ఒక శాతం కూలీల సంక్షేమానికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ, శ్రీను, వీరస్వామి, శోభన్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


భవన నిర్మాణ కార్మిక సంఘం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నేతలు

దంచికొట్టింది..!


- జోన్ వ్యాప్తంగా ఈదురు గాలులతో భారీ వర్షం
- విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, తీగలు
- చాదర్‌ఘాట్ నుంచి నల్గొండ క్రాస్ రోడ్డు ట్రాఫిక్ జామ్




కురసిన వర్షానికి మలక్‌పేట్‌లో ప్రధాన రోడ్డుపై నిలిచిన వాహనాలు




కురిసిన వర్షానికి మలక్‌పేట్ రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు


మలక్‌పేట్ రైల్వే బ్రిడ్జి కింద భారీ ట్రాఫిక్ జామ్


వర్షానికి మలక్‌పేట్‌లోని రోడ్డుపై నిలిచిన వాహనాలు


ప్రధాన రహదారిపై నిలిచిన వరదనీరు పోవడానికి ప్రయత్నిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట్ నియోజకవర్గంలో శుక్రవారం సాయంత్రం భారీగా కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. కాలనీలలో డ్రైనేజీలు పొంగిపొర్లాయి.. ఇంకా గట్టిగా కురిస్తే తమ ఇళ్లలోకి వరదనీరు వస్తుందేమోనని లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందారు. వర్షానికి కాలనీలలో అక్కడక్కడ చెట్లు నేలకొరిగాయి. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఓ పక్కకు ఒరిగి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి.

నాలాలు పూడుకుపోయి.. వరదంతా రోడ్లపైకి.!

◆ జోన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్, ఆర్‌కేపురం, మలక్‌పేట్, ఓల్డమలక్‌పేట్, సరూర్‌నగర్, సైదాబాద్‌లోని జయనగర్ కాలనీ, కుర్మగూడ, అక్బర్‌బాగ్, అజంపుర, చావుణి తదితర కాలనీలు, బస్తీలలో వరదనీరు ముంచెత్తాయి. ఈ ప్రాంతాల్లోని నాలాలు పూర్తిగా పూడుకుపోయి వరదంతా రోడ్లపై కాలనీల్లో ప్రవహిస్తోంది. నాలాలలో ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టకపోవడంతో వరదనీరు సాఫీగా వెళ్లలేక కాలనీ, బస్తీ రోడ్లపైకి వచ్చాయి.

వర్షాలు వచ్చినప్పుడల్లా...

◆ వర్షాలకు దిల్‌సుఖ్‌నగర్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం, మూసారంబాగ్, సైదాబాద్‌లలోని పలు అపార్ట్‌మెంట్స్‌లలోని సెల్లార్లలోకి వరదనీరు వస్తుండటంతో అపార్టుమెంట్స్ వాసులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు వచ్చినప్పుడల్లా ఇదే పరిస్థితి నెలకొంటుందని అపార్టుమెంటు వాసులు చెబుతున్నారు. కనీసం ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి లోతట్టు ప్రాంతాలలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్‌చేస్తున్నారు. వర్షకాలానికి ముందే ఈ పనులు చేపట్టి పూర్తి చేస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.


మూసారాంబాగ్ బిడ్జిపై ప్రవహిస్తున్న వరదనీరు

సమస్యల పరిష్కారానికి కృషి

నాగోలు: ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తున్నామని రంగారెడ్డి జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ అన్నారు. పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ ఉత్సవాల సందర్భంగా కొత్తపేట్ డివిజన్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేశ్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం 'గావ్ చలో బస్తీ చలో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇన్‌చార్జి క్లెం రవీందర్ రెడ్డితో కలిసి వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్‌నగర్ బస్తీలో చిత్తారమ్మ గుడి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం బస్తీలో పర్యటించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ నేతృత్వంలో పనిచేసిన కొత్తపేట డివిజన్ సీనియర్ నాయకులు, పెద్దలను శాలువాలతో సన్మానించారు. అనంతరం బస్తీవాసులతో కలిసి సంహపక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో కొత్తపేట్ డివిజన్ సీనియర్ నాయకులు, బూత్ స్థాయి అధ్యక్షులు, క్రియాశీలక సభ్యులు పాల్గొన్నారు.


చిత్తారమ్మ గుడి వద్ద శుభ్రం చేస్తున్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్ పవన్‌కుమార్

ఓయో రూమ్స్, హోటళ్లపై పోలీసులు స్పెషల్ డ్రైవ్

నాగోలు: ఎల్‌బీనగర్ డివిజన్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యభిచారులు, ట్రాన్స్‌జెండర్లు ఎక్కువగా పెరిగిపోవడం, వివిధ లాడ్జిలు జరుగుతన్న అసాంఘిక కార్యక్రమాలపై పోలీసులు హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీసులు, ఎస్ఓటీ పోలీసులతో కలిసి గురువారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య సూచనల మేరుకు ఎల్‌బీనగర్, చైతన్యపురి, నాగోలు, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హోటల్స్, ఓయో రూమ్స్, లాడ్జిలపై దాడులు నిర్వహించారు. ఈ దాడులల్లో ఆరుగురు మహిళను పోలీసులు రెస్క్యూ చేశారు. మరో 5 మంది కస్టమర్స్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పలువురు ట్రాన్స్ జెండర్లును అదుపులో తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు.

◆ ఇటీవల ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో లక్ష్మి అనే మహిళపై ఓ వ్యక్తి హత్య చేయడంతో అప్రమత్తమైన పోలీసులు రోడ్లు వెంబడి నిలబడి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతన్న వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. ఎల్‌బీనగర్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, వ్యభిచారం నిర్వహించిన రాత్రి సమయాల్లో రోడ్లు మీద నిలబడి అసభ్యంగా ప్రవర్తించిన కఠిన చర్యలు తప్పవని ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య హెచ్చరించారు. ఎల్‌బీనగర్ పరిధిలో ఓయో రూమ్స్, లాడ్జిలపై, హోటల్స్ పై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

అద్దంకి దయాకర్, అంజన్‌కుమార్ యాదవ్‌పై ఫిర్యాదు

చైతన్యపురి: దేశప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌లపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం సరూర్‌నగసర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం ఓ బహిరంగ సభలో వారు మాట్లాడిన భాష బీజేపీ నాయకులు, కార్యకర్తల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు.

సురేందర్‌కు గిన్నిస్ అవార్డు

నాగోలు: డివిజన్ పరిధిలోని జైపురికాలనీ చెందిన పి.సురేందర్ సంగీత పోటీల్లో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు. 18 దేశాల నుంచి 1,046 మంది సంగీతకారులు కీబోర్డులో సరలీ–స్వరాస్ ఆడటంతో పాటు ఆన్‌లైన్‌లో గంటలో అప్‌లోడ్ చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో సురేందర్ స్థానం సంపాదించాడు. ఇటీవల నగరంలో జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు ఆనంద రాజేంద్రన్ చేతుల మీదగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్, గోల్డ్ మెడల్ అందుకున్నాడు.

చలివేంద్రం ప్రారంభం

చైతన్యపురి: సైన్ యూనివర్స్ (స్పిరుచ్వల్) ఆధ్యాత్మిక విభాగం ధ్యాన మనోప్రస్తానం, ఆధ్యాత్మిక విశ్వగురువు వైజ్ఞానిక ఋషి శ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి దివ్య ఆశీస్సులతో చైతన్యపురి బస్‌స్టాప్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ భద్రయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... వేసవిలో బాటసారులు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించటం అభినందనీయమని అన్నారు.


చలివేంద్రం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై భద్రయ్య

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

మలక్‌పేట: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మలక్‌పేట ఫైర్ స్టేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అహ్మద్ బలాల పోస్టర్ ఆవిష్కరించారు. పంజేషాహలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అగ్నిప్రమాదాలకు తావులేకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈనెల 20 తేదీ వరకు స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో విస్తృతంగా ఫైర్ సెఫ్టీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఫైర్ ఆఫీసర్ అంజిరెడ్డి తెలిపారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల, ఫైర్ ఆఫీసర్ అంజిరెడ్డి

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు ఇలా ఉన్నాయి. టమోటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.32, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.18, దొండ రూ.18, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.18, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.15, సొరకాయ రూ.40, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.28, మునగ రూ.23.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేద్దాం

మన్సూరాబాద్: తిరుపతిలో మే15న జరిగే ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేద్దామని సీపీఐ ఎల్‌బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. హయత్‌నగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్‌బీనగర్‌లో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న యువత వ్యతిరేక విధానాలపై, విద్య, వైద్యం, ఉపాధి హక్కులు, మీడియా స్వేచ్ఛ, రాజ్యాంగ పరీరక్షణ తదితర అంశాలపై చర్చలుంటాయని తెలిపారు. దేశం నలుమూలల నుంచి యువ ప్రతినిధులు మహాసభలకు హాజరవుతున్నట్లు తెలిపారు. దేశ యువతను తీర్చిదిద్దే దిశగా కార్యచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మర్రి శోభన్, శేషరాజుపల్లి శ్రీదేవి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నేతలు

రాచకాలువపై అక్రమ కట్టడాలను కూల్చివేయిస్తాం

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని రాచకాలువపై అక్రమ కట్టడాలను హైడ్రా దృష్టికి తీసుకెళ్లి కూల్చివేయిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. డ్రైనేజీ ట్రంక్ లైన్ నిర్మాణం కోసం రెవెన్యూ, ఇరిగేషన్, జలమండలి అధికారులతో కలిసి బీఎన్‌రెడ్డినగర్ శివారు తూర్పు 21 కాలనీల్లోని రాచకాలువ గుండా శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2023లో సాధారణ ఎన్నికల ముందు బీఎన్‌రెడ్డినగర్ శివారు 21 కాలనీల డ్రైనేజీ లైన్ల కోసం దాదాపు రూ. 6 కోట్ల నిధులు మంజూరు చేసి శంకుస్థాపనలు చేశామని గుర్తు చేశారు. అయితే అవి శిలాఫలకాలకే పరిమితం అవుతాయని, ఎలక్షన్ స్టంట్ అని విమర్శించిన కాంగ్రెస్ నాయకులు మధుయాష్కీగౌడ్, కార్పొరేటర్ లచ్చిరెడ్డి ప్రస్తుతం ఆయా పనుల దగ్గర ఫొటోలు దిగి షో చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేటర్ లచ్చిరెడ్డి అక్రమ వసూళ్లకు తెరలేపి రాచకాలువ మీద అక్రమ కట్టడాలను ప్రోత్సాహిస్తున్నారని ఆరోపించారు. త్వరలోనే అందరి బండారాలు బయట పెడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం రాజగోపాల్, మండల సర్వేయర్ జ్యోతి, ఇరిగేషన్ డీఈ శుక్లజా, ఏఈ సతీశ్, కాలనీల నాయకులు మనోజ్ గొరిశెట్టి, శ్రీశైలం, కృష్ణ, రమేష్, రాజుగౌడ్, సూర్య నాయక్, రాము నాయక్, నర్సిరెడ్డి పాల్గొన్నారు.


రాచకాలువ గుండా పర్యటిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఓంకార్ నగర్ కాలనీ ఆర్చి ప్రారంభం

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఓంకార్‌నగర్ కాలనీ ఆర్చిని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, నాయకులు శ్రీధర్‌గౌడ్, జైపాల్, అజయ్, అనిల్, సలీం, శ్రీనివాస్, రవి, కాలనీ అధ్యక్షుడు యాదగిరి, రామస్వామి, వీరయ్యగౌడ్, రవికుమార్, రవికిశోర్ పాల్గొన్నారు.